నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 31 మే 2024 | SANGAREDDY

రాజముద్రను మార్చడం సరైంది కాదు

రామాయంపేట, మే 30: ఏ రాష్ట్ర చిహ్నంలోనైనా, దేశ చిహ్నంలోనైనా చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉంటుంది. దానిని ప్రతిఒక్కరూ గౌరవించాలి. రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలిగించాలని నిర్ణయించడం సరైంది కాదు. మేధావుల సమక్షంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన చిహ్నం ఒక కులానికి, మతానికి సంబంధం లేకుండా ఉన్నది. అందులో మనందరికీ తెలిసి ఎలాంటి లోపాలు లేవు. మార్చాలనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో సోషల్ మీడియాలో వైరలై, ప్రజలందరి మెప్పు పొందిన మన రాజముద్రను కేసీఆర్ ప్రభుత్వం అధికార ముద్రగా ప్రకటించింది. దీనిని ఇలాగే కొనసాగిస్తే ప్రజల అభిప్రాయాన్ని కూడా గౌరవించినట్లు అవుతుంది.

– శివొల్ల కృష్ణ, కళాకారుడు, డి.ధర్మారం, రామాయంపేట

రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేస్తే ఉద్యమమే..

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతోమంది అమరులను స్మరించుకోవడానికి అప్పటి తెలంగాణ ఉద్యమ సారథి, బీఆర్ఎస్ అధినేత ఎంతో మంది మేధావుల పర్యవేక్షణలో రాష్ట్ర చిహ్నానికి రూపకల్పన చేసిన విషయం కాంగ్రెస్ సర్కారు గమనించాలి. కాంగ్రెస్ నాయకులు వారి ఉనికి కోసం చిహ్నంలో మార్పులు చేసి కాకతీయ కళాతోరణాన్ని, హిందూముస్లింల ఐక్యతకు ప్రతీకైన చార్మినార్‌ను తొలిగించాలని చూస్తే రాష్ట్ర ప్రజలు సహించరు. ముందు కాకతీయ కళాతోరణం, చార్మినార్ ప్రత్యేకతలను, విశేషాలను తెలుసుకుని రాష్ట్ర సర్కారు ముందుకు పోవాలి. లేదంటే ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే రాష్ట్ర ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయం.

– కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు, గుమ్మడిదల మండలం

మార్పు అంటే ఇదేనా?

కోహీర్, మే 30: కాంగ్రెస్ పాలనలో మార్పు అంటే ఇదేనా...? తెలంగాణ ప్రజలకు ఏం చేస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. గెలిచిన తర్వాత ఇచ్చిన హామీలు మరిచిపోయి, ప్రజలకు అవసరం లేని కొత్త పనులు చేస్తున్నారు. వందల సంవత్సరాల క్రితం నుంచి ఉన్న కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలిగిస్తామని చెప్పడం ప్రజల దృష్టిని మరల్చేందుకే. చిహ్నాలు తొలిగించడం, టీఎస్‌కు బదులుగా టీజీ పెట్టడంతో ప్రజా సంక్షేమం జరుగుతుందా, ప్రజల జీవనప్రమాణాలు పెరుగుతాయా? కాంగ్రెస్ నాయకులే చెప్పాలి. ప్రజలు కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించారో అనే సంగతి ఆ పార్టీ నాయకులు మర్చిపోయారు. త్వరలో తగిన మూల్యం చెల్లించుకుంటారు.

– సతీశ్‌రెడ్డి, సంఘ సేవకుడు, మాచిరెడ్డిపల్లి, కోహీర్ మండలం

ప్రజాగ్రహానికి కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు

కొమురవెల్లి, మే 30: ప్రజాగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు. పదేండ్లుగా కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలనను కొనసాగించలేని రేవంత్ సర్కారు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకలైన తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తులను తెలంగాణ రాజముద్ర నుంచి తొలిగించడం నీచమైన చర్య. తెలంగాణ ప్రజలు మీకిచ్చిన అవకాశాన్ని సంక్షేమం, అభివృద్ధిలో చూపించాలి. కానీ రాష్ట్ర పరిపాలనను గాలికొదిలి ప్రజల దృష్టిని మర్చాలని దృష్ట పన్నాగం పండడం దురదృష్టకరం. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై కక్షకట్టి టీఎస్‌ను టీజీగా మార్చడమే గాక తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్ గుర్తులను మార్చేందుకు సిద్ధం కావడం రేవంత్ వికృత చేష్టలకు నిదర్శనం. కేసీఆర్ సారథ్యంలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది ఆత్మబలిదానాల సాక్షిగా తెలంగాణను సాకారం చేసుకున్నాం. ఏనాడూ తెలంగాణ కోసం ఉద్యమంలో పాల్గొనని, తెలంగాణ చరిత్ర తెలియని రేవంత్ రాజముద్రను మార్చడం సిగ్గుచేటు. ఈ విషయాలను ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల తిరగబడే రోజు తప్పక వస్తుంది.

– పబ్బోజు విజేందర్, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు

కౌడిపల్లి: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ధాన్యాన్ని త్వరగా తరలిస్తాం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, మే 30: కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయిన ధాన్యాన్ని త్వరగా తరలిస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం ఆయన కౌడిపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. జిల్లాలో 300 కేంద్రాలు ఉండగా 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. మిగిలిన 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని త్వరగా తరలిస్తామన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని ఇతర జిల్లాలకు అందజేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు వస్తున్నాయా, లేబర్ కొరత ఉందా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 4వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందజేశామని తెలిపారు. మిగతా రైతులకు కూడా అందజేస్తామని ఎలాంటి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. అనంతరం తునికి జిల్లా పరిషత్ అమ్మ ఆదర్శ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. జూన్ 10లోగా పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. నాగసాన్‌పల్లిలోని ఎరువుల షాపును కలెక్టర్ తనిఖీ చేశారు. మండలానికి 200 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల పెద్ద జనుము విత్తనాలు వచ్చాయని చెప్పారు. మరో 95 క్వింటాళ్ల జీలుగ, 120 క్వింటాళ్ల జనుము విత్తనాలు వస్తాయన్నారు. ఆయన వెంట తహశీల్దార్ ఆంజనేయులు, ఏడీఏ పుణ్యవతి, ఏవో స్వప్న, ఇతర అధికారులు ఉన్నారు.

తునికి అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

రాళ్లకత్వ శివారులోని సర్వేనంబర్ 286 ప్రభుత్వ భూమిలో తవ్విన గుట్ట

- ప్రభుత్వ భూమిలో ఐదునెలలుగా మట్టి తవ్వకాలు
- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- రాళ్లకత్వ ప్రభుత్వ భూమిలో తవ్వి శివనగర్‌కు రవాణా
- అడ్డుకున్న వారికి బెదిరింపులు

జిన్నారం, మే 30: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని రాళ్లకత్వలో సర్వే నంబర్ 286లో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొందరు రైతులకు అసైన్డ్ భూములు ఉన్నాయి. గతంలో కంకర క్రషర్‌కు కేటాయించారు. ప్రస్తుతం అక్కడ క్రషర్ నడవడం లేదు. రైతుల భూములు, క్రషర్ కోసం గుట్టలుగా పోసిన మట్టిని ఐదు నెలలుగా టిప్పర్లలో రాత్రిపూట తరలిస్తున్నారు. రాళ్లకత్వ, శివనగర్ గ్రామానికి చెందిన కొందరు టీంగా ఏర్పడి ప్రభుత్వ భూమిలోంచి దర్జాగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. రోజుకు దాదాపు వంద టిప్పర్లకు పైగా మట్టి తరలుతోంది. మూడు ఇటాచీలతో వేగంగా తవ్వకాలు జరుపుతున్నారు. రాళ్లకత్వ కంకర క్రషర్ వద్ద ఇటాచీలు, జనరేటర్, టిప్పర్లు ఉన్నాయి. మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లిన మీడియాకు అవి కనిపించాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డు ఎక్కకుండానే టిప్పర్లను శివనగర్ చెరువులోంచి తరలిస్తున్నారు. దీంతో ఎవరికి మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. మండలానికి చెందిన ఓ నాయకుడు అక్రమ మట్టి తవ్వకాల వెనుక ఉన్నారని, అందుకే రెవెన్యూ అధికారులు చర్యలకు వెనుకాడుతున్నారని రెండు గ్రామాలకు చెందిన పలువురు ఆరోపించారు. రాళ్లకత్వ ప్రభుత్వ భూమిలోంచి జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ఏప్రిల్ 13న 'యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం అయ్యింది. ఈ కథనంతో రెవెన్యూ అధికారులు హడావిడి చేసి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండు రోజుల క్రితం రాళ్లకత్వ గ్రామంలో మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. దీనిపై కలెక్టర్ దృష్టి సారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

విత్తనాలు దొరికేనా!

సీజన్‌కు ముందే రైతుకు విత్తన కష్టాలు

మంగళవారం పుల్కల్‌లో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్ద క్యూలో ఆధార్ కార్డులు, పాస్‌బుక్కులు

సంగారెడ్డి, మే 30(నమస్తే తెలంగాణ): విత్తనాల కొరత రైతులను కలవరపెడుతున్నది. వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో విత్తనాల కొరత ప్రారంభమైంది. విత్తనాల కోసం రైతులు పట్టాదారు పాసుపుస్తకాలను వరుసలో పెడుతున్నారు. ఇటీవల జోగిపేటలో రైతులు జీలుగ విత్తనాల కోసం క్యూలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పెట్టడంతో పాటు ధర్నాకు దిగారు. మంగళవారం పుల్కల్, చౌటకూరు మండల కేంద్రాల్లో రైతులు జీలుగ విత్తనాల కోసం బారులు తీరారు. మెదక్ జిల్లా తూప్రాన్, వెల్దుర్తి తదితర మండలాల్లోనూ రైతులు చెప్పులు క్యూలో పెట్టి నిరీక్షించారు. విత్తనాలు అందించాలని రాస్తారోకోలు చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, దుబ్బాకలో కూడా ఇటీవల రైతులు జీలుగ విత్తనాల కోసం క్యూకట్టారు. సరిపడా విత్తనాలు లభించక పోవడంతో నిరాశతో వెనుదిరిగారు. వ్యవసాయ అధికారులు టోకెన్లు జారీ చేయడం, విత్తనాలు అందజేయడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రైతులు వరుసలో నిలబడలేక పట్టాదారు పాసుపుస్తకాలను క్యూలో పెడుతున్నారు. గంటల తరబడి ఆగ్రోస్ సేవా కేంద్రాల వద్ద వేచి చూసే పరిస్థితులు ఉన్నాయి. కొరత కారణంగా రైతులకు సకాలంలో జీలుగ విత్తనాలు అందడం లేదు. విత్తనాల కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వ్యవసాయశాఖ అధికారుల పనితీరుపైనా రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్యూలో పట్టాదారు పాసుపుస్తకాలు ఉంచి గంటల తరబడి వేచిచూస్తున్నా అధికారులు వేగంగా స్పందించి విత్తనాలు ఇవ్వడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోనూ రైతులు విత్తనాల కొరతను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి విత్తన కష్టాలను తొలిగించాలని రైతులు కోరుతున్నారు.

వేధిస్తున్న జీలుగ విత్తనాల కొరత

వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో రైతులకు విత్తన కొరత వేధిస్తున్నది. వానకాలం సాగుకు రైతులు భూములను సారవంతం చేసేందుకు పొలాల్లో జీలుగ, జనుము సాగుచేసి దున్నుతారు. ఇలా చేయడం ద్వారా చౌడు, ఇతర నేల భూములు సారవంతమవుతాయి. జిల్లాలో వరి సాగుచేసే రైతులతో పాటు వానకాలం సీజన్‌లో ఇతర పంటలు సాగుచేసే రైతులు జనుము, జీలుగ వేస్తారు.

ఇటీవల అకాల వర్షాలు కురవడంతో రైతులు జనుము, జీలుగ మొదలుపెట్టారు. అయితే జనుము, జీలుగ విత్తనాల కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం సీజన్ ప్రారంభమయ్యేందుకు ఇంకా రెండువారాల సమయం ఉంది. అంతలోగా జనుము, జీలుగ సాగు, దున్నటం పూర్తికావాలి. రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. సంగారెడ్డి జిల్లాకు 5881 క్వింటాళ్ల జనుము, జీలుగ విత్తనాలు అవసరం. 1981 క్వింటాళ్ల జనుము విత్తనాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 1300 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేశారు. జీలుగ విత్తనాలు 3900 క్వింటాళ్లు అవసరం కాగా, ఇప్పటి వరకు 1800 క్వింటాళ్లు వ్యవసాయ శాఖ సరఫరా చేసింది. ఇంకా 2100 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా కావాల్సి ఉంది. ఇంకా 2100 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు రాలేదు. రైతులకు అవసరమైన మేర జీలుగ విత్తనాలను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలను క్యూలో పెట్టడంతో పాటు ధర్నాలకు దిగుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద విత్తనాల కోసం క్యూలో చెప్పులు ఉంచిన రైతులు

వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే జీలుగ విత్తనాల కొరతతో ఇబ్బందులు పడుతుంటే, సీజన్ ప్రారంభమయ్యాక ప్రధాన పంటలైన వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, జొన్న విత్తనాల కొరత తప్పదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొన్నది. వానకాలంలో సంగారెడ్డి జిల్లాలో 7,24,405 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి, 1.50 లక్షల ఎకరాల్లో వరి, 80వేల ఎకరాల్లో కంది, 15వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగుకానున్నాయి. అధికారుల సమాచారం మేరకు వానకాలం సీజన్‌లో వరి, కంది, మొక్కజొన్న, సోయాచిక్కుడు, పెసలు, మినుములు, జొన్న విత్తనాల 54,944 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయి. 4.50 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం. సంగారెడ్డి జిల్లాలోని 450 ప్రైవేటు సీడ్ డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలను వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచుతున్నది. ఓవైపు విత్తనాల కొరత, మరోవైపు నకిలీ విత్తనాల బెడద రైతులను వేధిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం, విత్తనాల కొరతపై స్పందించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలకు సరిపడా జీలుగ విత్తనాలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

వరి, పత్తి విత్తనాల కొరత తప్పదా?

విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు

- సంగారెడ్డి జిల్లాలో రైతులకు సరిపడా విత్తనాలు
- జిల్లాలో 3,76,422 కిలోల పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధం
- 3.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయనున్న అన్నదాతలు
- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు
- అధిక ధరలకు విత్తనాలు అమ్మితే డీలర్లపై చర్యలు
- అందోళన వద్దు.. అందరికీ విత్తనాలు, ఎరువుల సరఫరా
- కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడి

సంగారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, మే 30: ప్రభుత్వం విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుందని, ఎవరైనా కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా విత్తనాలు, ఎరువుల కొరత సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వానకాలం సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు రైతులకు అందించేందుకు అధికారులు సిద్ధం చేశారన్నారు. జిల్లాలో పత్తి సాగుకు రైతులు అత్యధికంగా మొగ్గు చూపడంతో వారికి అవసరమైన మేరకు పత్తి విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా 3.60లక్షల ఎకరాల్లో పత్తి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారని, వారి కోసం 3,76,422 కిలోల పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాకు చేరుకున్నాయన్నారు. ఇంకా అవసరమైతే తెప్పించి రైతులకు అందజేస్తామని చెప్పారు. విత్తనాల కోసం రైతులెవరూ ఆందోళన చెందకుండా డీలర్ల వద్ద విత్తనాలు తీసుకోవాలని, అందుబాటులో లేకుంటే మండల వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు..

వానకాలం సాగుకు సిద్ధమైన రైతాంగానికి అవసమైన పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందని, జిల్లాకు సరిపడా చేరుకున్నాయని కలెక్టర్ వెల్లడించారు. రైతులను అందోళనకు గురిచేసేందుకు ప్రచారం చేస్తున్న వారిని పట్టించుకోకుండా అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. జిల్లాకు 3,900 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు, 1,981 క్వింటాళ్ల జనుము, 5,881 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేటాయించారన్నారు. ప్రస్తుతానికి 2,217 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 4,198 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు చేరుకున్నాయన్నారు. జిల్లాలోని 55 కేంద్రాలతో రైతులకు విత్తనాలు సరఫరా చేస్తున్నామని, 2,028 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రెండు, మూడు రోజుల్లో వస్తాయని, పూర్తిస్థాయిలో విత్తనాలు జిల్లాకు రాగానే అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులను మోసం చేసి లబ్ధి పొందేందుకు డీలర్లు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలను డీలర్లు అమ్మినా, నాణ్యతలేని విత్తనాలు అమ్మినా ఆయా దుకాణాలపై దాడులు చేసి లైసెన్సుల రద్దుకు ప్రభుత్వానికి సిఫారుసు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్‌రావ్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

రైతుల కృషి అభినందనీయం

రైతులను సన్మానిస్తున్న రాహుల్ విశ్వకర్మ, శాస్త్రవేత్తలు

కౌడిపల్లి, మే 30: తునికి శివారులోని కృషి విజ్ఞాన జ్యోతి ఫౌండేషన్‌లో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం 100మంది రైతులు సేంద్రియ వ్యవసాయం, నూతన టెక్నాలజీ విధానాలపై చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ పాల్గొని రైతులతో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం, నూతన టెక్నాలజీలో కృషి విజ్ఞాన కేంద్రం, రైతులు కలిసిమెలిసి ముందంజలో ఉంచాలని సూచించారు. ఇతర మండలాల నుంచి పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

సిద్దిపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, మే 30: నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురవారం కలెక్టరేట్‌లో సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధతో కలిసి నకిలీ విత్తనాల నియంత్రణపై వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు కూడా మోసపోకుండా వ్యవసాయ, పోలీస్ అధికారులు సమన్వయంతో దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో సరిపడా జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ జీలుగ విత్తనాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో నకిలీ విత్తనాల కేసు నమోదు చేయలేదన్నారు. రానున్న 15, 20 రోజులు చాలా ముఖ్యమైనవని, నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నకిలీ విత్తనాలను కలిగి ఉన్నా లేదా రైతులకు విక్రయించినా సంబంధిత షాప్‌ల యజమానులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యవసాయ, హార్టికల్చర్, స్టాటిస్టికల్ అధికారులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట నష్టం కలిగినప్పుడు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన చాలా ఉపయోగంగా ఉండి రైతులకు ఆర్థిక చేయూతనందిస్తుందని, ఈ పథకంలో రైతులందరినీ చేర్పించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వానకాలంలో వరి, మొక్కజొన్న, పత్తి, కంది, టమాట, మామిడి, ఆయిల్ పామ్ పంటలకు ఇన్సూరెన్స్ అవకాశం ఉందని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్, సెరీకల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు..రాక్షస పాలన

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 30: రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా రాక్షస పాలన నడుస్తోందని, ఎంతసేపు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై బురద చల్లడం తప్ప ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులకు దశాబ్ది ఉత్సవాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చిహ్నాల్లోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తులను తొలిగిస్తామనడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు మోపడానికి చిహ్నాలను తొలిగించడానికే సమయాన్ని వృథా చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ చిహ్నాల్లో మార్పు ప్రజాపాలనలో తప్పులకు నిదర్శమన్నారు. వ్యవసాయం, నీళ్లకు కాకతీయ కళాతోరణం, వైద్య సంక్షేమానికి చార్మినార్ గుర్తులని చెప్పారు. తెలంగాణ రాజముద్రను మార్చడం తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టడమే అన్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని హితువు పలికారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజావ్యతిరేక దిశగా అడుగులు వేస్తున్నదని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో విధ్వంసానికి గురైన అనేక రంగాలు కేసీఆర్ హయాంలో పునర్జీవనం దిశగా అడుగులు పడితే, వాటిని ఛిద్రం చేసే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నదన్నారు. దమ్ముంటే రాజకీయాలను రాజకీయంగా ఎదుర్కోవాలని, చిహ్నాలను తొలిగించడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆంధ్ర నాయకులకు వత్తాసు పలికే విధంగా రేవంత్ విధానాలు ఉన్నాయన్నారు. కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు దశాబ్ది వేడుకలను గజ్వేల్ నియోజకవర్గంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు